

ఎమ్మెల్సీ కవితను కలిసేందుకు ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి వెళ్తున్న కేటీఆర్, హరీశ్

# ఈడీది కోర్టు ధిక్కరణే

మొదటిపేజీ తరువాయి...

రెండు పిటిషన్లపై ఒకేసారి విచారణ జరిపే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. మరోవైపు ఈడీ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కవితను సోమవారం కేటీఆర్, హరీశ్‌రావు కలిశారు. సాయంత్రం నిర్దేశించిన సమయంలో వారు ఈడీ కార్యాలయానికి వెళ్లారు. కవితతో చర్చించిన అనంతరం వారు తిరిగి వెళ్లిపోయారు.

### 245 ప్రాంతాల్లో సోదాలు చేశాం

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ నేపథ్యంలో ఈడీ సోమవారం ప్రత్యేక ప్రకటన విడుదల చేసింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో భాగంగా దేశవ్యాప్తంగా 245 ప్రదేశాల్లో సోదాలు చేశామని వెల్లడించింది. మొత్తం 15 మందిని అరెస్ట్ చేశామని తెలిపింది. వారిలో ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్‌సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్‌నాయర్ వంటివారు ఉన్నట్టు పేర్కొన్నది. ఒక ప్రధాన ఫిర్యాదుతోపాటు ఐదు అనుబంధ ఫిర్యాదులను నమోదు చేసినట్టు తెలిపింది. ఇప్పటివరకు 128.79 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్టు వెల్లడించింది. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ కవితను ఈ నెల 15న ఆమె ఇంట్లో అరెస్ట్ చేసినట్టు తెలిపింది. తమకు అనుకూలంగా మద్యం విధానాన్ని రూపొందిస్తే రూ.100 కోట్లు ముట్టజెప్పేలా కవిత, కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా ఆప్ ముఖ్య నేతల మధ్య ఒప్పందం కుదిరినట్టు విచారణలో తేలిందని పేర్కొంది. హోల్‌సేలర్ల నుంచి ఆమ్ ఆద్మీ పార్టీకి అక్రమంగా నిధుల వరద పారిందని తెలిపింది. కవిత, ఇతర భాగస్వాములు కలిసి ఆప్‌కు ముట్టజెప్పిన మొత్తాన్ని తీసుకోవడంతోపాటు అదనంగా డబ్బు సంపాదించాలని ఆప్ ప్రణాళిక రూపొందించినట్టు వెల్లడించింది.

# రాష్ట్రంలో కంకర కష్టాలు


- మూడు రోజుల నుంచి మూతపడ్డ స్టోన్ క్రషర్లు
- యజమానుల సమ్మెతో కంకర సరఫరా బంద్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గత మూడు రోజుల నుంచి స్టోన్ క్రషర్లు మూతపడడంతో కంకర కష్టాలు మొదలయ్యాయి. కన్‌స్ట్రక్షన్ మెటీరియల్‌కు కొరత ఏర్పడి నిర్మాణరంగం స్తంభించిపోయింది. రోడ్డు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం రాయల్టీని భారీగా పెంచడడం, కొత్త నిబంధనల పేరుతో వేధింపులకు దిగడం, దీన్ని నిరసిస్తూ క్రషర్ల యజమానులు సమ్మెకు దిగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో కంకర ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కంకరపై రాయల్టీని ప్రతి టన్నుకు 250 నుంచి 395కి పెంచింది. ఇందులో పర్మిట్ ఫీజు పేరుతో కొత్తగా 58 చొప్పున వసూలు చేస్తున్నది. దీంతో గతంలో 600కు లభ్యమయ్యే టన్ను కంకరకు ఇప్పుడు రవాణా ఖర్చులు కలుపుకొని వినియోగదారుడు 1,000 వరకు చెల్లించాల్సి వస్తున్నది. మరోవైపు మైనింగ్ అధికారులు అడ్డగోలుగా తమపై దాడులు నిర్వహిస్తూ అనుమతులను రద్దు చేయడంతోపాటు భారీగా పెనాల్టీలు విధిస్తున్నట్లు క్వారీలు, క్రషర్ల యజమానులు వాపోతున్నారు.

### నిలిచిన రోడ్ల నిర్మాణం

రాష్ట్రవ్యాప్తంగా క్రషర్లు బంద్ కావడంతో కంకర సరఫరా ఆగిపోయింది. దీంతో రోడ్ల నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కంకరతోపాటు ఇతర సామగ్రి ధరల పెరుగుదలకు అనుగుణంగా తమకు చెల్లింపులు జరిపేందుకు అధికారులు ఒప్పుకుంటేనే పనులు కొనసాగిస్తామని, లేకుంటే తమకు గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్లు ఇప్పటికే అధికారులకు స్పష్టం చేశారు. కంకర, ఇసుక, రోబో శాండ్ ధరల పెరుగుదలతో నిర్మాణ రంగం స్తంభించింది. గతంలో 1,000కి లభ్యమైన టన్ను ఇసుక.. ఇప్పుడు 2,500 నుంచి 3 వేల వరకు పలుకుతున్నది. డీజీపీఎస్, ఈటీఎస్ విధానాలతో ఏర్పడిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ క్రషర్స్ ఓనర్స్ అసోసియేషన్ సోమవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చింది.

### లోకం పోకడ






బీఆర్ఎస్ పార్టీలో విశ్రాంత ఐపీఎస్ అధికారి, బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేరిక అనంతరం మీడియాతో మాట్లాడుతున్న అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ఆల వెంకటేశ్వరరెడ్డి, మెతుకు ఆనంద్, మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బాల్క సుమన్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు బాలరాజు యాదవ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రవీందర్‌సింగ్

# బహుజనమై గెలుద్దాం

మొదటిపేజీ తరువాయి...

ఉద్యమ సమయంలో తాను తిన్నన్ని తిట్లు మరెవ్వరూ తినలేదని, తనను తిట్టిన వారే తనదారికి వచ్చారని గుర్తుచేశారు. శూన్యం నుంచి సుడిగాలి సృష్టించామని వెల్లడించారు. సోమవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ సమక్షంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. 'స్వాతంత్ర్య సాధన అనంతరం నెహ్రూ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రభుత్వంలో నాటి సంస్థానాధీశులు, దేశ్‌ముఖ్‌లే గాంధీటోపీలు పెట్టుకుని ప్రజాప్రతినిధులయ్యారు. తెలంగాణ కోసం 1969 ఉద్యమంలో ముల్కీ రూల్స్ కోసం పోరాటం సాగింది. ముల్కీ నిబంధనలు కొనసాగించాలని ఏకంగా సుప్రీంకోర్టు చెప్పినా, జై ఆంధ్ర ఉద్యమం తెచ్చి తెలంగాణ ఉద్యమాన్ని అణచివేశారు. 1969 నాటి ఉద్యమంలో 400 మంది అమరులయ్యారు. ఆ తర్వాత తెలంగాణ చైతన్యం ఆగమైంది. ఫలితంగా ఆ ఉద్యమం చల్లారింది. తెలంగాణపై ఆసక్తిపోయిన, ఆ అసహాయ పరిస్థితిలో అన్నీ పార్టీల్లో తెలంగాణ నాయకులు బానిసలయ్యారు. ఆంధ్రా పాలకులకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే అణచివేతే ఉండేది. 1969 నుంచే నా మనసులో తెలంగాణ ఉన్నది. తెలంగాణ మీద ఆనాడు ఒక్కరికి కూడా సోయి లేకుండే తెలంగాణ కోసం పోదాం పా అంటే నువ్వంటవు గానీ అయితాదే అని వెనపట్లు పడేవాళ్లు' అని తెలిపారు. రాజకీయాల్లో అనేక కష్టాలు వస్తాయని, వాటిని తట్టుకొని నమ్మిన సిద్ధాంతం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 'తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో నేను తిన్న తిట్లు ఎవరూ తినలే. నా మీద దండకాలు కూడా రాసింద్రు. ఎన్ని కష్టాలెదురైనా, ప్రలోభాలు పెట్టినా తెలంగాణ వాదాన్ని వదల్లేదు. సందర్భం వచ్చినపుడు అవసరమైన పంథాను ముందుపెట్టి తెలంగాణ కోసం పోరాటంలో కేంద్రాన్ని గజ్జున వణికించాం. శూన్యం నుంచి సుడిగాలిని సృష్టించినం. అనేక సమస్యలను ఎదుర్కొన్నం. ఎదురొడ్డి నిలిచినం' అని వెల్లడించారు. అలాగే ఉమ్మడి పాలనలో తెలంగాణకు కరెంట్ సహా అన్ని రంగాల్లో జరిగిన వివక్షపై తాను చేసిన పోరాటాలను, ఎన్టీఆర్ హయాంలో ప్రజాప్రతినిధిగా, మంత్రిగా పరిష్కరించిన సమస్యలను, ఎదురు నిలిచిన సందర్భాలను కేసీఆర్ వివరించారు.

### సంక్షేమమే అక్కర్లేదన్నది చంద్రబాబు ఆలోచన

ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ప్రపంచ బ్యాంకు ఆర్థిక సంస్కరణలు అమలుచేయాలని చూసేవారని కేసీఆర్ తెలిపారు. 'ప్రజలకు తాగునీరు, విద్యుత్తు, సంక్షేమం అక్కర లేదనే భావనతో చంద్రబాబు ఉండేవారు. ఆ పర్యవసానాల ఫలితంగా ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్తు చార్జీలు పెరిగాయి. ఆ పెంచిన విద్యుత్తు చార్జీలకు వ్యతిరేకంగా స్పందించా. డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పదవులతో పాటు పార్టీ పదవులకు రాజీనామా చేశా. నాడు విద్యుత్తు ఉద్యమకారులను కాల్చిచంపిన దుర్మార్గమైన పరిస్థితులను ప్రజలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అనేక విజ్ఞప్తులు చేసినా నిర్లక్ష్యమే ఎదురయ్యేది' అని వెల్లడించారు. 1969 నాటి వైఫల్యాలు తిరిగి రావద్దని, 1969 నాటి ఉద్యమకారులతో చర్చించి తెలంగాణ ఉద్యమాన్ని మొదలుపెట్టానని చెప్పారు. 'ఇది స్ట్రీట్ ఫైటా.. స్టేట్ ఫైటా' అని అడిగానని, వారికి తెలంగాణ రాష్ట్ర సాధనే అసలైన పరిష్కారం అని చెప్పి ముందుకు సాగామని తెలిపారు. పార్లమెంట్‌లో చట్టం ద్వారానే తెలంగాణ ఏర్పాటు సాధ్యం అవుతుందని, అదే పంథాలో ముందుకు సాగామని వివరించారు.



**పసిబిడ్డకు శ్రేయా పూలే అని పేరుపెట్టిన కేసీఆర్**

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు అకినేపల్లి శిరీష-ప్రవీణ్ దంపతుల ద్వితీయ కుమార్తెకు శ్రేయా పూలేగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నామకరణం చేశారు.

### ఆరెస్సెస్ నుంచి ఆర్ఎస్‌యూ దాకా

తెలంగాణ కోసం ఆరెస్సెస్ నుంచి ఆర్ఎస్‌యూ వరకు అందరినీ కలిశామని, దేశంలోని 36 రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తెచ్చామని కేసీఆర్ వివరించారు. తన కేంద్ర మంత్రి పదవిని తెలంగాణ సాధన కోసం ఉపయోగించానని వెల్లడించారు. 'తెలంగాణ కోసం కలిసిన ప్రతి ఒక్కరికి స్టిల్ సీకింగ్ జస్టిస్ అనే వీడియో డాక్యుమెంటరీని చూపించేవాడిని. నన్ను సూడంగనే మల్లా వచ్చింద్రా అని జోకులు వేసుకునేవాళ్లు. కానీ తెలంగాణ కోసం మన పట్టుదల చూసి అంతా మద్దతు ఇచ్చారు' అని తెలిపారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి దగ్గరికే 18 సార్లు వెళ్లానని పేర్కొంటూ 'మీ బహుజన్ కాజ్ నా తెలంగాణ కాజ్ ఒకటే' అని ఆమెకు చెప్పి తెలంగాణకు మద్దతు లేఖ సంపాదించిన విషయాన్ని గుర్తుచేశారు.

### దేశానికి సరికొత్త ఎజెండాను తయారుచేద్దాం

బహుజన సిద్ధాంతంపై ఇంకా లోతైన చర్చ జరగాలని, దీనిపై స్పష్టమైన అవగాహన వచ్చేదాకా కమిట్‌మెంట్‌తో ముందుకు సాగాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. కోటానుకోట్ల బహుజనులకు చైతన్య స్రవంతి కోసం ఆలోచన చేసిన బుద్ధిజీవులు అదే పంథాలో ముందుకుపోవాలని అన్నారు. ఒక్కసారి కమిట్ అయ్యాక వెనక్కి తిరిగి చూడొద్దని చెప్పారు. ఈ మధ్యకాలంలో జరిగిన సమీక్షల్లో కొంతమంది దళితబంధు వద్దు అంటే తనకు ఆశ్చర్యం కలిగిందని తెలిపారు. దళితబంధు వల్ల పార్టీ నష్టపోయిందన్న భావన కొంతమందిలో ఉన్నదని, అయితే అది సరైన ఆలోచనా విధానం కాదని స్పష్టం చేశారు. దళితబంధు పొందిన కుటుంబాలు బాగుపడ్డాయని ఉదహరించారు. దళిత సమాజం దళితబంధు పథకాన్ని పాజిటివ్‌గా ఎందుకు తీసుకోలేకపోయిందో బహుజన యువ మేధావులు విశ్లేషించాలని కోరారు. దళితశక్తితో పాటు బహుజన శక్తి కలిసిపోవాలన్న సిద్ధాంతం కోసం కాన్షీరాం పోరాటం చేశారని గుర్తుచేశారు. ఆ స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు. బహుజనుల్లో సామాజిక చైతన్యస్థాయిని మరింత పెంచాల్సి ఉన్నదని వెల్లడించారు. 'కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా దళితుల మీదే దాడులు జరుగుతున్నాయి. పాలకుల మీద ఐకమత్యంతో పోరాటం చేసి హక్కులు సాధించుకోవాలి. ఈ విషయంలో అగ్రవర్ణ పేదలను కలుపుకొని పోవాలి. ప్రతిపక్షశక్తుల మీద పోరాటం చేస్తున్న క్రమంలో కలిసివచ్చే శక్తులను కలుపుకోవాలి. సమాజంలో 20 శాతం ఉన్న దళితులు ఐక్యంగా నిలిస్తే సాధించలేనిది ఏదీ లేదు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా నూతన సచివాలయాన్ని నిర్మించలేదు. అలాంటిది దేశానికే తలమానికంగా తెలంగాణ నూతన సచివాలయం నిర్మించి దానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును పెట్టుకున్నాం. తెలంగాణ తర్వాతే మరే రాష్ట్రమైనా అనే రీతిలో 125 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని నిర్మించుకున్నాం. దళిత శక్తిని, బలహీన వర్గాలను ఐక్యం చేసేందుకు అందరం నడుం కడదాం. ఈ దేశానికి సరికొత్త ఎజెండాను తయారు చేద్దాం' అని పిలుపునిచ్చారు.

### యువ నాయకత్వం ఎదగాలె

**తెలంగాణ యువ నాయకత్వం ఎదగాలని కేసీఆర్ ఆకాంక్షించారు. 'మీ లాంటి (పార్టీలో చేరిన వారిని వారిని ఉద్దేశించి) యువత నాయకత్వం ఎదిగితే, అవకాశవాదంతో పార్టీలోకి వచ్చిపోయే స్వార్థపరుల అవసరం ఉండదు. వచ్చే ఎన్నికల వరకు మీరంతా నాయకులుగా ఎదగాలె' అని పిలుపునిచ్చారు. రాష్ట్రం సాధించాక రైతాంగాన్ని దరికి తేవాలని సాగునీటి ప్రాజెక్టులను తెచ్చామని తెలిపారు. అన్నమో రామచంద్రా అని అలమటించిన నా తెలంగాణ 3 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తిని సాధించిందని పేర్కొన్నారు. అగాధంలో ఉన్న తెలంగాణకు బీఆర్ఎస్ పాలనలో ధైర్యం వచ్చిందని వెల్లడించారు.**

### కాంగ్రెస్ పాలనేంటో ప్రజలకు తెలిసిపోయింది

ఉద్యమకాలంలో సమైక్య పాలకులకు తొత్తులుగా ఉన్న నాయకులను కొన్ని మాటలు అనాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రాష్ట్రాన్ని సాధించిన తరువాత తాను ఏనాడూ ఎట్లాపడితే అట్లా మాట్లాడలేదని కేసీఆర్ గుర్తుచేశారు. 'ఎట్లబడితే అట్లా అసభ్యంగా బూతుకూతలకు దిగలె. పబ్లిక్ లైఫ్ ఉన్నప్పుడు ఓడినా, గెలిచినా ఒక్కతీరుగా వుండాలె. మన ప్రజలు-మన రాష్ట్రం అన్న పద్ధతిలో ముందుకుసాగాలె. అధికారం ఉంటే ఒకతీరు, లేకుంటే ఒక తీరు ఉండొద్దు' అని అన్నారు. 'కేసీఆర్ తెచ్చిన పథకాలు ఎక్కడికిపోవు. వచ్చేటాయిన ఎక్కువిస్తాడేమోనని ఆశకు పోయి మోసపోయింద్రు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు నమ్మి అటు మళ్లింద్రు. ఇప్పుడు ప్రజలకు వాస్తవం అర్థం అవుతున్నది. ఒకసారి ఓడితే నష్టమేమీ లేదు. గాడిది ఎంబటి పోతేనే కదా గుర్రాల విలువ తెలుస్తది' అని చెప్పారు. కష్టపడితే వచ్చే టర్మ్‌లో నూటికి నూరు శాతం బీఆర్ఎస్ గెలుస్తుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పాలన మీద ప్రజలు మూడు నెలల్లోనే ముక్కు ఇరుస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు కనీసం మిషన్ భగీరథ ద్వారా మంచినీళ్లు ఎందుకు ఇవ్వలేకపోతున్నారో అర్థం కావటం లేదని తెలిపారు.

### బహుజన సిద్ధాంతమే పునాదిగా

దళిత, బహుజన సిద్ధాంతమే ఎజెండాగా ముందుకు సాగుదామని కేసీఆర్ పిలుపునిచ్చారు. దేశంలో ప్రస్తుతం ఉన్న ఏ రాజకీయ పార్టీకి లేనంత స్పేస్ బీఆర్ఎస్‌లో ఉన్నదని చెప్పారు. త్వరలో బీఆర్ఎస్‌ను క్షేత్రస్థాయి నుంచి నిర్మించుకుందామని తెలిపారు. నిరంతర శిక్షణ తరగతులు నిర్వహించుకుందామని వెల్లడించారు. పార్టీలో అన్ని స్థాయిల్లో కమిటీలు వేద్దామని, తెలంగాణ నుంచే బహుజన బేస్ నిర్మిద్దామని, బహుజన హితాయ సుఖాయ నానుడికి తెలంగాణ నుంచే అంకురార్పణ చేద్దామని అన్నారు. ఇక్కడి నుంచే యావత్తు దేశానికి బీఆర్ఎస్ టార్చ్‌బేరర్‌గా పనిచేయాలని ఆకాంక్షించారు.

### బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా ఆర్ఎస్పీ!

మంచి ఆశయం కోసం రాజకీయాల్లో వచ్చిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను హృదయపూర్వకంగా బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్నానని, ఆయన భవిష్యత్తులో ఉన్నతస్థానంలో ఉంటారని కేసీఆర్ ప్రకటించారు. మంచి ఆశయం కోసం పనిచేసినవారికి మంచి రాజకీయ, సామాజిక ఫలితాలుంటాయని చెప్పారు. ఆచరణయోగ్యమైన కార్యాచరణతో కలిసి పనిచేద్దామని తెలిపారు. డెడికేటెడ్‌గా పనిచేసే వ్యక్తి ప్రవీణ్‌కుమార్ అని, గురుకుల విద్యను అభివృద్ధి చేసే క్రమంలో ప్రవీణ్‌కు ఎంతో సహకరించానని గుర్తుచేశారు. ఫలితంగా ఎంతోమంది బహుజన బిడ్డలను విద్యావంతులను చేశారని, దేశ, విదేశాల్లో వాళ్లు ఇవ్వాళ ఉన్నతస్థాయిలోకి వచ్చారని వివరించారు. దేశ గురుకుల విద్యావ్యవస్థలో తెలంగాణను ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. గొప్ప ఆశయంతో బీఆర్ఎస్‌లోకి వచ్చిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీమంత్రులు నిరంజన్ రెడ్డి, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, మెతుకు ఆనంద్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్య, గువ్వల బాలరాజు, మాజీ చైర్మన్లు రవీందర్‌సింగ్, బాలరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఎన్నో పరీక్షలను ఎదుర్కొన్నారు: నిరంజన్‌రెడ్డి

నాడు సీతమ్మ తల్లి ఒక్కసారే అగ్నిపరీక్ష ఎదుర్కొన్నారని.. తెలంగాణ ఉద్యమం నుంచి నేటి దాకా కేసీఆర్ అనేక అగ్నిపరీక్షలను ఎదుర్కొంటూ ధైర్యంగా నిలబడుతున్నారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఎర్రవల్లిలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరిక సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ వాదమే బహుజన వాదమని, రెండూ వేర్వేరు కాదని తెలిపారు. మీడియా దుష్ప్రచారంలో ప్రజలు ప్రభావితమై తప్పుడు నిర్ణయం తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి కాంగ్రెస్ పాలనలో పరిస్థితులను చూసి ప్రజలు తీవ్రంగా బాధపడుతున్నారని వెల్లడించారు. అందరం కలిసొచ్చే అన్ని సిద్ధాంతాలతో కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. అంతా కలిసికట్టుగా నాగర్‌కర్నూల్ ఎంపీ సీటును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని అన్నారు. ఉన్నవాళ్లు కష్టకాలంలో స్వార్థంతో పక్కకుపోతుంటే, బయటినుంచి ప్రవీణ్ కుమార్, బీఎస్పీ రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు వచ్చి బీఆర్ఎస్‌లో కలుస్తున్నందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## బీఎస్పీ నుంచి బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

### ఆర్ఎస్పీతోపాటు కారెక్కిన వందలాది మంది నాయకులు, కార్యకర్తలు

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): బీఎస్పీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ (ఆర్ఎస్పీ)తోపాటు వందలాది మంది ముఖ్యనేతలు బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో బీఎస్పీ రాష్ట్ర, జిల్లా, పార్లమెంట్ నియోజకవర్గ, అసెంబ్లీ స్థాయి నాయకులతోపాటు ఆ పార్టీలో వివిధ విభాగాలకు చెందిన ముఖ్యనేతలు ఉన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ వివిధ హోదాల్లోని రాష్ట్ర స్థాయి బాధ్యుల వివరాలు...**

కందికంటి విజయ్ కుమార్, విజయ్ ఆర్య, దాసరి హనుమయ్య, (రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు) పూదరి సైదులు, అరుణ రాణి, నర్రా నిర్మల, జక్కని సంజయ్, మల్లేశ్ యాదవ్ (రాష్ట్ర కార్యదర్శులు), రాజరత్నం (రాష్ట్ర కోశాధికారి), శ్యాంరావ్ జాడే, పుట్టల శీలజ (రాష్ట్ర మాజీ సభ్యులు) ఎం కేశవ రావు, మందశ్యామ్ (నాగర్‌కర్నూల్, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జులు) ముస్త్యాల కిషన్ (ఆర్ఎస్పీ సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు), మహేందర్ నాయక్ (ఆర్ఎస్పీ గిరిజన సేన రాష్ట్ర అధ్యక్షుడు), జిల్లా అధ్యక్షులు నటరాజ్ (సంగారెడ్డి), సునీల్ రుద్రవరం(సికింద్రాబాద్), చాట్ల చిరంజీవి (హైదరాబాద్), అమ్మఒడి శ్రీనివాస్ (హన్మకొండ), మేకల రవీందర్ (కరీంనగర్), పొన్న జనార్దన్ (మెదక్), మధు మహరాజ్ (భద్రాద్రి),కొండా భీమయ్య (సూర్యాపేట), లెందుగూరే శ్యాంరావు (కుమ్రంభీం), జిల్లా ఇన్‌చార్జిలు ఆదిమల్ల గోవర్ధన్ (నల్లగొండ), ఉప్పల జహంగీర్ (యాదాద్రి), తాళ్లపల్లి వెంకటస్వామి (జనగాం), ఓంకార్ యాదవ్ (హన్మకొండ), ముర్మూరు శేఖర్ (పెద్దపల్లి) కె.బ్రహ్మయ్య (నాగర్ కర్నూల్), తోకల కృష్ణ (మహబూబ్‌నగర్), జిల్లా ప్రధాన కార్యదర్శులు మల్లేశ్ గౌడ్ (సంగారెడ్డి), కంకం బాబు (గద్వాల్),సుజయ్ కుమార్ (జనగాం) తదితరులు ఉన్నారు.

# రేవంత్.. వార్నింగ్‌లు బంద్‌చెయ్

**నేనూ పాలమూరు బిడ్డనే.. తుంగభద్ర నీళ్లు తాగినోడినే**

- గేట్లు తెరిస్తే రావడానికి గొర్రెల మందలో ఒకడిని కాదు
- తెలంగాణ వాదం.. బహుజన వాదం రెండూ ఒక్కటే
- కేసీఆర్ మాటిస్తే మడమ తిప్పరు.. నేనూ ఆయన లెక్కనే
- తెలంగాణభవన్‌లో మీడియాతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి వార్నింగులు బంద్ చేయాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హితవు పలికారు. 'పాలమూరు బిడ్డనని చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి.. నేను కూడా పాలమూరు బిడ్డనే. ఒక వైపు నన్ను సుతిమెత్తగా పొగుడుతూనే, మరో వైపు సుతిమెత్తగా వార్నింగులు ఇస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఇస్తానని సీఎం ఇచ్చిన ఆఫర్ వాస్తవమే. నేను తిరస్కరించిందీ వాస్తవమే. నేను ప్రజాక్షేత్రంలో ఉండాలనుకున్నా. బీఆర్ఎస్ వైపు వెళ్తే ప్రజలకు సమాధానం చెప్పాలని మీరు బెదిరింపులకు దిగుతున్నారు. నేను వాటికి భయపడేది లేదు' అని సీఎం వ్యాఖ్యలకు ఆర్ఎస్పీ దీటుగా బదులిచ్చారు. ఏ పార్టీలోకి వెళ్లాలో, వెళ్లకూడదో నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ తెలంగాణ ప్రజలకు లేదా? అంటే వార్నింగ్ ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. ఎక్కడ గేట్లు ఓపెన్ చేస్తే.. అక్కడికే వెళ్లాలా? అని సీఎంను నిలదీశారు. సోమవారం ఆయన గజ్వేల్‌కు భారీ ర్యాలీగా బయలుదేరే ముందు తెలంగాణభవన్‌లో, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకొన్న అనంతరం ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో మాట్లాడారు. 'నేను ఇప్పటికీ.. ఎప్పటికీ అణగారిన వర్గాల గొంతుకగా ఉండాలని బీఆర్ఎస్‌లోకి వచ్చా. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజల ప్రాణాలు, తాగునీరు, సాగు నీళ్లు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, సంక్షేమ పథకాలకు గ్యారెంటీ ఇవ్వలేకపోతున్నది. మీడియాలో ప్రచార ఆర్భాటం తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదు. పేదలు, రైతులు, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా ఉండాలనే బీఆర్ఎస్‌లో చేరుతున్నా' అని అన్నారు. తన భావజాలానికి దగ్గరగా ఉన్న పార్టీ బీఆర్ఎస్ అని.. అందుకే ఈ పార్టీలో చేరుతున్నానని ప్రకటించారు. సీఎంగా రేవంత్‌రెడ్డి పాలన వదిలేసి, ప్రచారం చేసుకొనేందుకు ప్రపంచానికి వైబ్రంట్‌గా ఉంటున్నారని విమర్శించారు. నిజంగా ప్రజలకు సేవ చేయటం లేదని ఆరోపించారు. ప్రాణహిత-గోదావరి, తుంగభద్ర-కృష్ణ నదులుగా తెలంగాణవాదం, బహుజనవాదం రెండూ ఒక్కటేనని అన్నారు. ఒకప్పుడు తెలంగాణవాదం, బహుజనవాదం అణచివేతకు గురయ్యాయని, పోరాటాల ద్వారా, ఉద్యమకారులను కలుపుకొని కేసీఆర్ విముక్తి కల్పించారని కొనియాడారు.

### పదేండ్లు స్వర్ణయుగం

కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పదేండ్లపాటు స్వర్ణయుగాన్ని చూసిందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. తెలంగాణకు బలమైన, గొప్ప పునాది వేశారని వెల్లడించారు. అందుకే అధికారం లేకపోయినా ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉన్నారని వెల్లడించారు. చాలామంది నేతలు బీఆర్ఎస్‌ను వీడిపోతున్న తరుణంలో పెద్ద బలగంలా వచ్చిన తనను అక్కున చేర్చుకున్న బీఆర్ఎస్ నేతలకు కృతజ్ఞతలు అని తెలిపారు. ఒక బలమైన తెలంగాణను నిర్మించే యజ్ఞంలో భాగస్వాములు కావాలనుకుని బీఆర్ఎస్‌లో చేరుతున్నానని చెప్పారు. పొత్తు రద్దు చేసుకోవాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి ఒత్తిడి తెచ్చారని, స్నేహబంధానికి విలువ ఇచ్చి ఆ పార్టీకి రాజీనామా చేశానని తెలిపారు. కేసీఆర్ మాదిరి ప్రవీణ్‌కుమార్ కూడా మడమ తిప్పరని, మాట ఇస్తే కట్టుబడి ఉండాలనే బీఆర్ఎస్‌లో చేరుతున్నానని వెల్లడించారు. తనతో పాటు వచ్చిన బహుజనులకు, అవకాశం ఇచ్చిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. తన గుండెల్లో బహుజనవాదం, మహనీయులు, అమరుల త్యాగాలు, వారు చూపించిన సారాంశం ఎప్పటికీ ఉంటాయని గుర్తుచేశారు. తనలో ఎలాంటి స్వార్థం లేదని, బహుజనులంతా తనను అర్థం చేసుకోవాలని కోరారు.

### వాళ్లంతా పిరికిపందలు, స్వార్థపరులే

ముఖ్యమంత్రి గేట్లు తెరిస్తే పోయినోళ్లంతా పిరికిపందలని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. అక్రమంగా ఆస్తులు సంపాదించినోళ్లు వాటిని కాపాడుకోవడానికి అక్కడికి వెళ్లారని ఆరోపించారు. 'మీరు గేట్లు ఎత్తితే చాలామంది పిరికిపందలు, అసమర్థులు, స్వార్థపరులు ఆ గేట్ల నుంచి గొర్ల మందల్లా వస్తున్నారు. ఆ గొర్రెల మందలో ప్రవీణ్‌కుమార్ ఒకడు కాలేడు. కాడు కూడా. నిజాయతీతో, నిస్వార్థంగా నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసే నాయకుడిని. ఆ గొర్లమందలో కలవలేదన్న అక్కసుతో ఆ మాటలు అంటున్నవా సీఎం?' అని ప్రశ్నించారు.

### రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వామిని అవుతా

'చాలామంది కేసీఆర్ దగ్గర ఎంత ప్యాకేజీ తీసుకున్నావని అడుగుతున్నారు. నేను ప్యాకేజీ తీసుకునేవాడిని అయితే, అధికార పార్టీ గేట్ల దగ్గర కూర్చొనేవాడిని కదా. నేను ప్యాకేజీల కోసం వచ్చినవాడిని కాదు. ప్రశ్నించడానికి వచ్చినవాడిని. దొంగ ఆస్తులను రక్షించుకుందామని వచ్చినవాడిని కాదు. భయంతో వేరే పార్టీలో చేరేవాడిని అంతకంటే కాదు. పోలీసు ఉద్యోగాన్ని పక్కనపెట్టి.. కేసీఆర్ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పదేండ్ల పాటు, పది లక్షల మంది విద్యార్థులను ప్రయోజకులుగా మార్చాను. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి బెదిరించటం బంద్ చేయాలె. ఎందుకంటే నేను కూడా పాలమూరు బిడ్డనే. తుంగభద్ర నీళ్లు తాగినోడినే. నడిగడ్డ గాలి పీల్చిన. నడిగడ్డ తిండే తిన్నా. హోదాను తగ్గించుకోవద్దు' అని ఆర్ఎస్పీ హితవు పలికారు. కార్యక్రమంలో చురుగ్గా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దేవీ ప్రసాద్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.